క్లుప్తంగా

నేడు మంత్రిరోజా పర్యటన

నగరి : నగరి మున్సిపాలిటీలోని పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ‘నా దేశం–నా మట్టి నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం ఆజాదీ కా అమృత మహోత్సవ్ వేడుకల్లో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ పరిధిలోని సత్రవాడ–1 సచివాలయ పరిధిలోని వినాయకపురం, మిట్ట స్ట్రీట్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు పథకాల ద్వారా చేకూరుతున్న లబ్ధి గురించి తెలుసుకుంటారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు


అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళమాసం ఆడి నెలను పురస్కరించుకుని గ్రామదేవతను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యువత రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

నగరి : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా తౌహిద్ జమాత్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వారు కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో 60 మంది రక్తం ఇచ్చారు. రక్తదానం చేసిన వారు సమస్త మానవ ప్రాణులను కాపాడిన వారవుతారన్న ప్రవక్త సందేశాన్ని అనుసరించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా తౌహిద్ జమాత్ సభ్యులు తెలిపారు.

ఇంటి నిర్మాణ పనుల పరిశీలన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్

వెదురుకుప్పం: అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాచెరువు జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అర్హత ఉన్నవారికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇంటి నిర్మాణాలకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు పలికల్లులో గడప గడపకు..

పెనుమూరు(కార్వేటినగరం) : మండల పరిధిలోని పులికల్లు గ్రామ సచివాలయంలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పాల్గొంటారని మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులికల్లు సచివాలయ పరిధిలోని గొడుగుమానుపల్లి, పులికల్లు, ఎలుంగుడ్లపల్లి, చెర్లోపల్లి, సింగంవారి ఊరు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారని, అదే విధంగా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, వలంటీర్లు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గంగమ్మకు పాలాభిషేకం


అలంకరణలో అమ్మవారు

రేణిగుంట: మండలకేంద్రంలో గంగమ్మజాతర నిర్వహిణకు సంబంధించి మంగళవారం అంకురార్పణ జరిగింది. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సుమారు 300 మంది మహిళలు ఎర్రదుస్తులు ధరించి వేపాకు చుట్టిన పాలకుండను నెత్తిన పెట్టుకుని నడివీధి గంగమ్మ వద్దకు చేరుకున్నారు. పాలకుండలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పాలాభిషేకం చేశారు. రాత్రి జాతర చాటింపు జరిగింది. ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

జయహో భారత్


నగరి కోర్టులో జెండా ఎగురవేస్తున్న ఇన్‌చార్జి జడ్జి జానకి


నగరి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, రామ్‌ప్రసాద్‌రెడ్డి, అధికారులు

- వాడవాడలా రెపరెపలాడిన జాతీయ పతాకం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులు

నగరి : జయహో భారత్.. వందేమాతరం.. మా తుజే సలాం అంటూ ఆకాశాన్ని తాకేలా వాడవాడలా యావత్ భరతజాతి గొంతుకలు ధ్వనించాయి. దేశభక్తి ప్రజ్వలించేలా అన్ని ప్రాంతాల్లో స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ పీజీ నీలమేఘం జెండా ఎగురవేయగా ముఖ్యఅతిథిగా మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలమే స్వాతంత్య్రం అని, నేడు మనం ఆ ఫలాలను అనుభవిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇన్‌చార్జ్ జడ్జి జానకి జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అలాగే ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సుజన, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భార్గవి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ జెండా ఎగురవేశారు. మండలంలోని ముడిపల్లిలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు యూనిఫాంతో హాజరుకావడం ప్రత్యేకతను సంతరించుకుంది. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు. గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2వేలు నగదు బహుమతి అందజేశారు.

బొల్లిగుట్టపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం..

కార్వేటినగరం: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఈ సందర్భంగా మండలకేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో సుమారు 300 అడుగుల ఎత్తు ఉన్న బొల్లిగుట్టపై 77వ సాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యువకులు త్రివర్ణ పతాకం ఎగురవేశారు. అలాగే కార్వేటినగరంలోని శ్రీలక్ష్మీ నరసింహా ప్రైవేటు కళాశాల విద్యార్థులు 164 అడుగుల జాతీయజెండాను పురవీధుల్లో ఊరేగించారు.

గంగాధరనెల్లూరులో..


కార్వేటినగరం: బొల్లిగుట్టపై జాతీయ జెండా రెపరెపలు

గంగాధరనెల్లూరు: మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కార్యాలయాలను పుష్పాలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సాతంత్య్ర సమర యోధులను గుర్తు చేసుకున్నారు. అలాగే వీరకనెల్లూరు గ్రామ సమీపంలోని సుమారు 200 అడుగుల ఎత్తు ఉన్న కొండపై స్థానిక యువత త్రివర్ణ పతకాన్ని ఎగర వేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

నింద్రలో..

నింద్ర: మండలవ్యాప్తంగా స్వాతంత్య్ర వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో పతాక ఆవిష్కరణ జరిగింది.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా 77వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల జీవత చరిత్ర, పోరాటాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. అనంతరం మాథ్యూస్ సేవాట్రస్ట్ ద్వారా, అలాగే ముంబైకి చెందిన బౌన్స్ కంట్రోలర్ జ్యూస్ సంస్థ ద్వారా తిలక్ ఆధ్వర్యంలో స్కూళ్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా జ్యూస్, స్వీట్లను అందించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో స్వాతంత్య్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాడవాడలా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.


పాలసముద్రం: ఎంపీడీఓ కార్యాలయంలో..

అనంతరం స్వాతంత్య్ర సమర యోధులను స్మరించుకున్నారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

అగ్రపథాన పయనిస్తున్న భారత్

పుత్తూరు రూరల్: స్వాతంత్య్రం వచ్చిన తర్వాత భారత్ అన్ని రంగాల్లోనూ అగ్రపథాన పయనిస్తోందని పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర అన్నారు. మంగళవారం 77వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా స్థానిక సబ్ కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేసి గౌరవ వందనం సమర్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మున్సిపల్ కార్యాలయంలో..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఏ.హరి జాతీయ జెండాను ఎగుర వేశారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. అలాగే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వై.శ్రీనివాస రావ్ జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భువనేశ్వరి జాతీయ జెండాను ఎగుర వేశారు. విద్యార్థినులు జాతీయ నాయకుల వివిధ వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. నగరం రోడ్డు సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. మాజీ సైనికుడు బి.గజేంద్రనాయుడును సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే వడమాలపేట మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన తరుణ్‌కు స్థానిక సామాజిక కార్యకర్త పి.దేవరాజు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణతో ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో జాతీయ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విన్యాసాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 77 అంకెల ఆకారంలో కూర్చుని విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఎంపీపీ శ్యామల స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ జవాన్లను సన్మానించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందించారు.


వీరకనెల్లూరు కొండపై జాతీయ జెండా ఎగురవేస్తున్న యువత


పెనుమూరు సీహెచ్‌సీలో..


పుత్తూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి రాఘవేంద్ర


పుత్తూరులో మానవహారం ఏర్పాటు చేస్తున్న విద్యార్థినులు


ముడిపల్లి పాఠశాలలో..


కార్వేటినగరం: మాజీ సైనికులను సన్మానిస్తున్న అధికారులు


నింద్ర: తహసీల్దార్ కార్యాలయంలో..


జీడీనెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో..


శ్రీరంగరాజపురంలో..


పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో..


వెదురుకుప్పంలో..


పాలసముద్రంలో..


బలిజకండ్రిగ హైస్కూల్లో 77 అంకెల ఆకారంలో విద్యార్థులు


విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

గంగజాతర ఘనంగా జరుపుకుందాం

నగరి : గంగజాతరను వైభవంగా జరుపుకుందామని జాతర నిర్వాహకులు తెలిపారు. మంగళవారం స్థానిక కరకంతేశ్వర స్వామి ఆలయంలో గంగజాతర నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. గతేడాది జాతర నిర్వహణకు సంబంధిత జమా ఖర్చుల వివరాలను వివరిస్తూ గత ఏడాది నిల్వ ఉన్న మొత్తం, అమ్మవారికి అందిన కానుకలు, దాతలు అందించిన సహకారాలను గ్రామసభ దృష్టికి తెచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన జాతర చాటింపు, 12, 13 తేదీల్లో గంగజాతర నిర్వహిస్తామన్నారు. గ్రామదేవత దేశమ్మ బ్రహ్మోత్సవాలను మంత్రి ఆర్కేరోజా టీటీడీ నుంచి పట్టు వస్త్రాల సారెను ఇప్పించి చరిత్ర గుర్తుంచుకునే మహత్తరకార్యం చేశారంటూ జాతర పెద్దలు కొనియాడారు. గంగమ్మ దేవతకు కూడా టీటీడీ సారె ఇప్పించేందుకు జాతర పెద్దలు కలిసి మంత్రిని సంప్రదించి విన్నవించుకోవాలన్నారు. ప్రస్తుతం దేశమ్మ ఆలయం నిర్మాణంలో ఉన్నందున కుంభాభిషేకం జరగకుండా అమ్మవారిని తీసుకురాలేమన్నారు. జాతరలోపు కుంభాభిషేకం జరపకుంటే జాతరలో గ్రామదేవతల ఊరేగింపు విడిగా నిర్వహించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నగరి జాతర జిల్లాస్థాయిలో ప్రాచుర్యం సంపాదించుకుందని, ఈ ఏడాది ఘనంగా నిర్వహించుకుందామని వారు కోరారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం జరిపే జాతరను అంతా కలిసికట్టుగా జరుపుకుందామన్నారు. నిర్వహణకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. తనవంతుగా రూ.లక్ష విరాళంగా అందిస్తానని చలపతి ప్రకటించారు. కార్యక్రమంలో జాతర పెద్దలు జ్యోతిరెడ్డి, ఆనం సురేష్, రాధాకృష్ణన్, దయానిధి, కృష్ణారెడ్డి, గుణశేఖర్, మణి, ఆర్.బాబు, బాబు రెడ్డి, రామ్మూర్తి యాదవ్, శ్రీనివాసన్, ఇంద్రయ్య, హరి, శ్రీనివాసులు, వెంకటముని, రమేష్, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ రెడ్డి, వాసు, రాము, గిరి, సుంధరరాజు, బాలాజీ, రమేష్ పుర ప్రముఖులు పాల్గొన్నారు.


గ్రామసభలో చర్చిస్తున్న జాతర పెద్దలు

మర్రిచెట్టును కాపాడండి

శ్రీరంగరాజపురం : మండలంలో కేంద్రంలోని పుల్లూరు క్రాస్ ప్రధాన కూడలిలో ఉన్న వంద ఏళ్ల నాటి మర్రిచెట్టును భూకబ్జాదారుడి చెర నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థానికుల కథనం మేరకు.. పుల్లూరు క్రాస్ ప్రధాన కూడలిలో శతాబ్ద కాలం నుంచి ప్రభుత్వ స్థలంలో మర్రిచెట్టు ఉంది. మండల కేంద్రానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలు ఈ చెట్టు కింద సేదతీరుతారు. పలువురు చిన్నపాటి వీధి వ్యాపారం చేసుకునే వారికి ఆసరాగా ఉంటుంది. అయితే ఈ చెట్టును తొలగించి ఆ ప్రాంతంలో కాంప్లెక్స్ నిర్మించడానికి స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి చెట్టు చుట్టూ గోతులు తవ్వించాడు. దీనిపై వీధి వర్తకులు, స్థానిక ప్రజలు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వెంటనే నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మళ్లీ ఇప్పుడు టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు చెట్టు కింద ఉండే వీధి వర్తకులను ఖాళీ చేయించి, చెట్టు చుట్టూ గోతులు తీయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శతాబ్దం నాటి మర్రిచెట్టును కాపాడి, భూకబ్జాదారున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.


మర్రిచెట్టు కింద విక్రయాలు సాగిస్తున్న చిరువ్యాపారులు